# ఎవరు వ్రాశారిది?

కొత్త పెళ్ళికూతురు పద్మ సుతారంగా పొట్లం విప్పింది. అందులో ఎర్రటి గాజులు మిలమిల మెరుస్తున్నాయి. ఆమె హృదయం ఒక్కసారి ఉప్పొంగిపోయింది. యధాలాపంగా గాజులు విప్పిన కాగితంలోకి చూసింది, చిన్నప్పటి నుంచి ఆమె కది అలవాటు. పొట్లం విప్పిన కాగితంలోని బొమ్మలు, వార్తలు సగం వచ్చిన కథలు, చూసిగాని చదివిగాని వదలదు.

అదే అలవాటుతో ఆ కాగితం చూసింది. ఏదో వారపత్రికలోని పేజీలా వుంది.

"భర్త ఒక ముళ్ళ కంప - భార్య, అలవోకగా దాని మీద పడిన రంగుల రవసెల్లా..."

పద్మ ఆగిపోయింది. కథలో ఎవరో అంటున్న మాటలు. అలాంటి మాటలు వ్రాసిన రచయిత, లేక రచయిత్రి మీద ఆమెకి ఎక్కడలేని కోపం వచ్చింది. ఎందుకిలాంటి అబద్ధపు మాటలు వ్రాసి స్త్రీలను బెదిరిస్తారీ రచయితలు? అని మరీ కోపం పెరిగిపోయింది. అది వ్రాసిన వారి పేరు కనిపిస్తుందేమోనని చూసింది కానీ, లేదు. కథ ఒకవైపు వుంది. మరోవైపు ఏదో ప్రకటన - మొదలు - తుదిలేని కథలో భాగం అది. ఆమె కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. పక్కనే పెట్టుకున్న ఎర్రగాజులు ఆమె కళ్ళలో ప్రతిఫలించినట్లుగా వుంది. ఆ గాజులు చూడగానే ఆమెకి నిన్నటి రాత్రి గుర్తుకొచ్చింది. అది ఆమెకి మొదటిరాత్రి - ఆ మధురానుభూతి ఆమెని మళ్లీ గిలిగింతలు పెట్టింది.

పద్మ బియ్యే అయింది. చక్కని రూపమే. తండ్రి ఎక్కువ కష్టపడకుండానే పదిహేనువేల కట్నంతో వరుణ్ణి కొన్నాడు. పెళ్లికొడుకు ఇంజనీర్. పద్మ పొంగిపోయింది.

ఏదో చదువుకున్నా, పెద్దగా ఆదర్శాలు పెట్టుకున్న యువతి కాదు పద్మ. వారపత్రికల్లో, ఉపన్యాసాల్లో వరకట్న నిషేధం గురించి, కులాంతర వివాహాల గురించి చూసినా, మనసా ఎప్పుడూ పట్టించుకోలేదు – ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కావడమే కష్టంగా వున్న యీ రోజుల్లో తనకి పెళ్ళి అవుతుంటే ఎంతో సంబరపడి, గర్వపడింది. పెళ్ళి అయిన తొలిరాత్రి తనని భర్త దగ్గరకి పంపుతూ –

"భర్త అంటే దైవం. అతనిని మించిన దైవం మరోటి లేదు. ముందు అతని దగ్గరగా వెళ్ళగానే పాదాలను కళ్ళకి అద్దుకో" అన్న తల్లి మాటలు తు.చ. తప్పకుండా పాటించింది. అతను చెప్పిన ప్రతిమాట శ్రద్ధగా వింది తనకి ఎంతో యిష్టమైన ఊదారంగు గాజులు అతను బాగుండలేదంటే తనేమీ బాధపడలేదు. ఎర్రటి ఎరుపుగాజులు వేసుకోమంటే పొంగిపోయింది. నిజానికి ఎరుపు గాజుల్ని తను చాలా వెక్కిరించేది. ఇప్పుడలా కాదు. అసలు తనకంటూ యిష్టమేమిటి? అతనేది చెప్తే అదే తనకి ఇష్టం –

పద్మ ఊదారంగు గాజులు తీసేసి ఎర్రగాజులు వేసుకుంది. పొడుగ్గా అందంగా వుండే జుట్టు దువ్వుకుని వదులుగా జడ అల్లుకుంటూ ఆలోచిస్తోంది. ఆ కాగితం ఆమె కళ్ళల్లో మెదులుతుంది. ఈసారి రాణిని కలిసినప్పుడు దాని దగ్గర అన్ని పత్రికలు వుంటాయి కనుక ఆ పేజీ ఎందులోదో కనుక్కుని, అది ఎవరు వ్రాశారో కనుక్కుని, తెలుసుకుని – వీలుంటే ఆ రచయితని ఊహూ – రచయిత్రే అయి వుంటుంది, కలుసుకుని తలవాచేటట్లు చీవాట్లు పెట్టాలి – చదువుకున్న భర్తల గురించి బహుశః ఆ రచయిత్రికి తెలీదు కాబోలు, చదువుకున్న వాడికి దానంతటదే సంస్కారం అబ్బుతుంది. అలాంటివాళ్లు ముళ్ళ కంపలెలా అవుతారు? తనింకా అదే విషయం ఆలోచించటం వ్యర్థం. అవకాశం వస్తే, ఆమెని నిలువునా దులిపెయ్యాలి. పద్మలో యింతటి ఆవేశం ఎప్పుడూ రాలేదు. మరెందుకో యిప్పుడు వచ్చింది.

❖ ❖ ❖

"పద్మా! ఈ రోజు నువ్వెంతో బాగున్నావు గాని, నువ్వు రోజంతా ఇంత వదులుగా జడవేసుకున్నావేమిటి?" అన్నాడు ఇంజనీరు భర్త.

"నాకదే అలవాటు చిన్నప్పటినుంచి" అంది గోముగా పద్మ.

"నీ అలవాట్లు తీసి పక్కన పెట్టు. రేపటి నుంచి గట్టిగా వేసుకో అంతే" అన్నాడు. అతని కంఠంలో కనిపించిన కరుకుతనానికి పద్మ హడలిపోయింది. మనసులో ఎక్కడో

కలుక్కుమంది. జడవేసుకోవడం దగ్గర నుంచి ఆయనకే కావాలా అనిపించింది. ఇంతవరకూ తనకెవరూ అడ్డు చెప్పలేదు. అందుకని అందులోని బాధ ఈరోజే మనసు రుచి చూసింది.

చిన్నప్పుడు మేడమెట్ల మీంచి దొర్లిపోయినప్పుడు కిందనున్న కొడవలిమీద పడి చెవిపై భాగం తెగిపోయి కుట్లు పడ్డాయి. అది రెండో చెవి నుండి వేరుగా కుట్లు కనిపిస్తూ వుంటుంది. అందుకని అమ్మ కూడా తనకి జడవదులుగా చెవులమీదకి జుట్టు పడేలా వేస్తుంది. తనకీ అదే అలవాటు.

రెండో రాత్రి చిన్నబోయిన మనసుతో, ఎలాగో గడిచిపోయింది.

మూడు రోజుల అనుభవం మూడు జన్మలకి సరిపడినంత సంపాదించుకుంది పద్మ. తను ఊహించిన వ్యక్తి కాదు తన భర్త. చదువుకుంటే దానంతటదే సంస్కారం వస్తుందనే ఆమె భావన పటాపంచలైంది. చదువుకీ మానసిక సంస్కారానికి సంబంధం లేదేమో అని ఆలోచించటం మొదలుపెట్టింది. పెళ్ళి అయిన పదిరోజుల్లో తల్లితో తన అసంతృప్తి చెప్పుకోలేక వూరుకుంది. వారం రోజులు అత్తవారింట్లో వుండడానికి వెళ్తూ, ఉత్సాహాన్ని పుంజుకుంది. అక్కడ నలుగురూ వుంటారు. సరదాగా గడుస్తుందనే ఏదో ఆశ. తనని అక్కడ దింపి వదిన మర్నాడు వచ్చేసింది. తన ఈడుదే ఆడబడుచు తనతో సరదాగా కబుర్లు చెపుతుంటే పొంగిపోయింది. సాయంత్రం అవుతుంటే ఇద్దరూ అందంగా తయారై వీధి వాకిట్లో నిలబడి కబుర్లతో, పరాచికాలతో ఆనందంగా వున్నప్పుడు దూరంగా వచ్చే భర్తని చూసి, సిగ్గుతో, భయంతో తనొక అడుగు ఇంట్లోకి వేసింది - వెనుక ఆడపడుచు ఏదో పరాచికం ఆడింది - అందులోనూ ఆనందమే వుంది.

"ఎవడికోసం చక్కగా తయారై నిలబడ్డావు సానిదానిలా" అన్న కర్కశమైన మాటలకి హతాశురాలైపోయింది. అవి వేళాకోళానికి అన్నమాటలు కావు. అయినా అలాంటి మాటలు ఎవ్వరూ పరిహాసంగా అనరు. అతని గొంతులో ధ్వనించిన రాక్షసత్వానికి ఖిన్నురాలై కళ్ళనీళ్ళు పెట్టుకుని నిలబడిపోయింది. ఆ మాటలకి యింట్లో ఎవరైనా తనని ఓదార్చుతారని ఒక రెండు నిమిషాలు చూసింది.

"మా వాడు నిక్కచ్చి మనిషి. అల్లరి చిల్లరి వేషాలు గిట్టవు" అన్న అత్తగారి సన్నాయి నొక్కులు వినిపించాయి. దుఃఖసముద్రం వెల్లువగా పొంగి గుండెల్ని అదరగొట్టేసింది.

❖ ❖ ❖

మన యిష్టాల్ని వ్యతిరేకించే వాళ్ళున్నప్పుడే మనకు దృఢమైన ఇష్టాలు ఏమిటో తెలుస్తుంది. స్త్రీ అయినా, పురుషుడయినా, చదువుకున్నా లేకపోయినా, ధనికుడైనా, బీదవాడయినా, తను ఇలా వుండాలి అని కొన్ని అభిప్రాయాలు పెట్టుకుంటాడు. వాటిని తీవ్రంగా ఖండించేవారు తారసపడినప్పుడు వారిలో సంఘర్షణ ప్రారంభమవుతుంది.

తనకంటూ యిష్టాలేమిటీ అనుకున్న పద్మలో తనకి చాలా యిష్టాలు అభిరుచులు వున్నట్లు స్పష్టమైంది. హృదయాన్ని బాధ కోసేయడం మొదలుపెట్టింది.

అందంగా తయారవకూడదు. తనకిది యిష్టం అని ఒకచీర కట్టుకోకూడదు, గుమ్మంలో నిలబడకూడదు, ఎవరితో ఏది మాట్లాడాలన్నా ముందుగా భర్త అనుమతి పొందాలి.

❖ ❖ ❖

పద్మ కుర్చీలో కూర్చుని ఆలోచిస్తోంది. విచారిస్తోంది. నాన్న తనకి బియ్యే వరకు చదువు చెప్పించి, పదిహేను వేలు కట్నం యిచ్చి పెళ్ళిచేశాడు. అతనిలో ఏమి చూశాడు? చదువు, హెూదా - కాని మనిషి సామాన్యంగా బ్రతకటానికి కావలసిన వ్యక్తిత్వం అతనిలో శూన్యం. కాని అదెలా ముందుగా కనిపెట్టగలం? దానికి ఏ యూనివర్సిటీ పట్టాలివ్వదు. ఏ ఎక్స్‌రే దాన్ని ఫోటో తీయలేదు. అది అనుభవ పూర్వకంగా తెలుసుకోవలసిందే. అయితే తెలుసుకుని ఏమీ చెయ్యలేని పరిస్థితి పద్మది.

ఆ విషయం గుర్తుకొచ్చి ఉలిక్కిపడి లేచింది. పెట్లో అడుగున పడేసిన కాగితం వెదికి తీసింది. రాణి యింట్లో పాత పత్రికలు తిరగేసి, రచయిత్రి ఎవరో తెలుసుకుని... అవును! తెలుసుకోవాలి. అందులో ఎంత స్పష్టంగా చెప్పింది! ముళ్ళకంచెమీద పరుచుకున్న పలుచని బట్టని తియ్యడం అసాధ్యం'.

పద్మ మళ్ళీ అనుకుంది. ఆ వ్యక్తి రచయితో, రచయిత్రో తెలుసుకోవాలి - తెలుసుకుని అభినందించాలి అంత చక్కగా చెప్పినందుకు-

●